
# సదా మీ సేవలో



భమిడి వెంకటేశ్వర్లు

**జీవితంలో...**

సరియైనసమయంలో నిర్ణయం తీసుకోకుండా తను పోగొట్టుకున్నదీ, నష్టపోయిందీ తెలుసుకున్నప్పుడు కలిగే బాధ, విచారం, చికాకు, ఆందోళన టన్నుల్లో ఉంటాయని సుబ్బారావుకి ముప్పయ్ అయిదేళ్లకు తెలిసొచ్చింది. అంతవరకూ తాను 'ఎ' క్లాసు మగాడనుకున్నాడు. నంబర్ వన్ పెళ్లికొడుకని ధీమాగా తిరిగాడు. హైటెక్ తెలివితేటలున్నాయి కాబట్టి ఏ విషయంలోనూ ఢోకా లేదనుకున్నాడు. చివరికి ముప్పయ్ రెండు సంబంధాలు చూశాక పప్పులో అడుగేసిన పరిస్థితి ఏర్పడింది.

'నీ మీద నీకు నమ్మకం లేకపోతే జ్యోతిషాన్ని నమ్ముతావు' అనే సామెత చాలామంది ద్వారా తెలుసుకోవలసివచ్చింది.

"పోండి... వయసు పెరిగాక పెళ్లి చేసుకుంటే చురుకైన సంతానం కలుగుతుంది" అంటూ చెప్పేవాడు సుబ్బారావు.

"ఎవరి పిచ్చి వారికానందం. జాతకాన్ని కాదన్నవారే చాటుగా అనుసరిస్తున్నారు" అన్నది సుందరి తరచూ.

సుబ్బారావు సుందరిని పెళ్లి చేసుకున్నాడు. గర్భం రాకుండా రెండేళ్లు జాగ్రత్తపడ్డారు వాళ్లు. ఇప్పుడు ఆమె గర్భవతి.

ఆ ప్రాంతంలో సీతారామయ్య, చేయి తిరిగిన జ్యోతిష్కుడు అనే పేరు పొందాడు. ఆయన వంద రూపాయల కన్సల్టేషను తీసుకుని

రోజుకి ఇరవైమందితో సరిపెట్టుకోడం రెండువేల రూపాయల రోజువారీ కలెక్షనుతో తృప్తి పడ్తాడు అని అభిమానుల అభిప్రాయం.

ఇప్పుడు సుబ్బారావు దంపతులు సీతారామయ్య దగ్గరికి బయలుదేరారు. వారి టోకెను నంబరు పన్నెండు. సీతారామయ్య దగ్గర డెలివరీ ముహూర్తం పెట్టించుకుని ఆసుపత్రి కెడితే నార్మల్ డెలివరీ అవుతుందని చాలామంది అభిప్రాయం, నమ్మకం.

"ఈ రోజుల్లో నార్మల్ డెలివరీలు ఎక్కడవుతున్నాయి? అందరికి మేడ్ ఈజీ రూటు కావాల్సివస్తోంది."

"పురుటి నొప్పులు భరించడం కంటే డబ్బు పోయినా సిజేరియను ఆపరేషనే మేలు."

"డబ్బుకోసం డాక్టర్లు సిజేరియన్లు చేసేస్తున్నారు."

"ఈ ముహూర్తంలో సిజేరియను చేయండి అంటున్నారు మరికొందరు."

"మీ ఫీజు ఇస్తున్నప్పుడు మాకు సలహాలివ్వడం ఏమిటి అనేవారూ ఉన్నారు."

"గర్భం ధరించిన ముప్పయ్ ఎనిమిది వారాలు దాటాక వారం-పది రోజుల తరువాత నార్మల్ డెలివరీ అవుతుంది అని నచ్చచెప్పే డాక్టర్లూ ఉన్నారు."

"తిథివారనక్షత్రాలు, సమయం, గ్రహబలమంటూ వచ్చేవారి నమ్మకాలని డాక్టర్లు అవకాశంగా తీసుకుంటున్నారు"-సీతారామయ్య దగ్గరి కొచ్చినవారు అలా అనుకొంటున్నారు.

సుబ్బారావు, భార్య మాత్రం ఎదురుగా ఉన్న 'నిశ్శబ్దం పాటించండి' అని ఉన్న బోర్డుకేసి చూస్తున్నారు.

గంట తరువాత సుబ్బారావు దంపతుల వంతు వచ్చింది. "మాకు కొడుకు పుడతాడని స్కానింగు రిపోర్టు చెబుతోంది. మా ఆవిడకు సీజరిను ఆపరేషన్ అంటే లైకింగు. మంచి ముహూర్తం పెట్టండి" సూటిగా పాయింటులో కెళ్లిపోయాడు సుబ్బారావు.

సీతారామయ్య వేళ్లు ముడుస్తూ కళ్లు మూసుకుని ఏవో లెక్కలు వేస్తున్నాడు. "తొలి సంతానంలో అబ్బాయికి హోమశాంతి, రుద్రాభిషేకం, నక్షత్రశాంతి, దానాలు, నవగ్రహజపాలు అవసరం. చాలామంది అవి అనవసరం అంటారు కాని నేను శాస్త్రప్రకారం నడిచేవాడిని" అన్నాడాయన.

"ఎంత ఖర్చు అవుతుంది?" అడిగింది సుందరి.

"పదివేలు."

గొంతులో ఉసిరికాయ ఇరుక్కున్న ఫీలింగు.

"సీజనులో అబ్బాయిలు పుడతారనేది నేను నమ్మను. డాక్టర్లు స్కానింగులని నేను అసలు నమ్మను. నేను వాస్తవాన్ని గౌరవిస్తాను. నిజం చెప్పడం నా పద్ధతి. సంపాదనకు వ్యతిరేకిని" అన్నాడు సీతారామయ్య కేలండరుకేసి చూస్తూ.

సుందరి మొగుడి వైపు చూస్తోంది అయోమయంగా.

"ఇంతకీ డెలివరీ ఎక్కడ, ఎవరు డాక్టరు?" అని అడిగాడాయన.

సుబ్బారావు చెప్పాడు వివరంగా.

"జాగ్రత్తండోయ్, డాక్టర్లనీ, ఆసుపత్రులను గుడ్డిగా నమ్మకండి. ఈ రోజుల్లో అంతా వ్యాపారమే" సలహాగా చెప్పాడు సీతారామయ్య ముహూర్తం రాసిన కాగితం ఇస్తూ.



ఫీజు తీసి ఇచ్చాడు సుబ్బారావు.

"నేను చెప్పినవి చేయించేందుకు అనుభవజ్ఞులుంటే మంచిది. డబ్బుకోసం ఆలోచించండి. ఆ తరువాత మీ ఇష్టం" చెప్పాడాయన.

సుబ్బారావు గుండె వేగం పెరిగింది.

"డాక్టరు బిల్లు ఆసుపత్రి చార్జీలు ఎంత అవసరమో ఎలా తప్పవో ఈ కార్యక్రమంలో తప్పవు. బిడ్డ యోగక్షేమాలు దృష్టిలో ఉంచుకోవాలి. నా దగ్గర అందుకు అనుభవజ్ఞులు ఉన్నారు. ముందుగా రిజర్వు చేసుకుంటే మంచిది" అంటూ ముగించాడు సీతారామయ్య.

సుందరి-సుబ్బారావు బయలుదేరారు. ఆమెకు డాక్టరు గుర్తుకొచ్చింది. దారే కాబట్టి ఓసారి చెకప్ చేయించుకోవాలనిపించింది. క్లినిక్ ఖాళీగా కనిపించింది పేషెంట్లు లేకపోడంతో. "డాక్టరమ్మ అమెరికా వెళ్లారు. ఆరు నెలల తరువాత వస్తారు" అంది పనిపిల్ల.

"ఎందుకు?" అడిగింది సుందరి.

"ఆళ్లమ్మాయికి డెలివరీ కదా!"

సుబ్బారావు దంపతులు ఖంగుతిన్నారు.

"మీ ఆసుపత్రిలోనే చేరతాను. మీరే డెలివరీ చేయాలి" అని అడిగింది సుందరి. అప్పుడు డాక్టరుని. సరేనంది డాక్టరు. కాని ఇప్పుడు సుందరిలో భయం పెరిగింది. అప్పుడు వారికి సీతారామయ్య గుర్తుకొచ్చాడు.

"నేను ముందే చెప్పాను కదా. వెళ్లి ఈ



## సిద్ధేంద్రయోగి

(క్రీ.శ. 15వ శతాబ్ది)

తెలుగువారికి ఒక ప్రత్యేక నాట్యకళా సంప్రదాయాన్ని ప్రసాదించిన కళాతపస్వి సిద్ధేంద్రయోగి. కృష్ణామండలంలోని శ్రీకాకుళంలో అనాథబాలుడుగా దేవాలయాన్ని ఆశ్రయించి జీవిస్తున్న సిద్ధప్పకు ఒక పేద బ్రాహ్మణుడు తన కూతురునిచ్చి పెళ్లిచేశాడు. భార్య తన నిరక్షరాస్యతను అవహేళన చేయగా, అతడు శ్రీకాకుళంలోని ఒకమఠంలో చేరి ఆ మఠాధిపతి సాయంతో ఉడిపి చేరుకున్నాడు. అక్కడి మఠాధిపతుల దయవల్ల వేదశాస్త్రాలను, సంగీతనృత్యాలను అభ్యసించాడు. అతడు బాల్యంలోనే సహజమైన ఉపజ్ఞతో నృత్యంలో కొన్ని కొత్త పోకడలు కూడా ప్రదర్శించేవాడు.

స్వస్థలానికి వెళ్లాలనుకొని సిద్ధప్ప కృష్ణానదికి చేరుకోగా, కృష్ణ వెల్లువతో పరవళ్లు తొక్కుతున్నది. సాహసించి ఏటిలో దుమికి ఈదుతుండగా, ఆయాస మెక్కువై మరణభయం కలిగి ఆతురసన్యాసం గ్రహించి సిద్ధేంద్రయోగి అయ్యాడు.

సిద్ధేంద్రయోగి తన నృత్యకళను దైవసేవలో వినియోగించి, తనను రాధగా భావించుకొని నృత్యం చేసేవాడు. ఆయన కృష్ణాజిల్లా కూచిపూడి గ్రామంలో కొందరు బ్రాహ్మణయువకులకు వేదశాస్త్రాలతోపాటు నృత్యమూ నేర్పాడు. ఆ కూచిపూడి శిష్యులవల్లనే అది దేశమంతటా వ్యాపించి కూచిపూడి భాగవతసంప్రదాయంగా పేరు పొందింది.

సిద్ధేంద్రయోగి 'శ్రీ కృష్ణపారిజాతము, గొల్లకలాపము' అనే రెండు నృత్యనాటికలను రచించాడు. అందులో రెండవదే 'భామాకలాపము' అని వ్యవహృతమవుతున్నది.

డాక్టరుని కలవండి. నేను కూడా ఫోను చేసి చెబుతాను.కంగారు పడకండి. ఇది డాలర్లయుగం. డబ్బు కోసం పరుగు పందెం. నీతినిజాయితీలకు నీళ్లు వదులుతున్న కాలం. త్వరగా వెళ్లండి." అంటూ డాక్టరు విజిటింగు కార్డు ఇచ్చాడాయన.

"డాక్టర్ నయన" గొణుక్కున్నారు సుబ్బారావు దంపతులు విజిటింగు కార్డు చూస్తూ. ఇద్దరూ క్లినిక్‌కి వెళ్లారు.

"స్త్రీలను గౌరవించండి. గర్భంలోని ఆడ శిశువుని ప్రేమగా ఆహ్వానించండి. మీ మాతృత్వానికి ప్రతీకగా నిలవండి. ఏ బిడ్డయినా మీరే కంటారు. మీరే అమ్మా, నాన్నా! భ్రూణహత్యలు నివారించండి. మాతో సహకరించండి." గోడకు వేలాడుతున్న బోర్డులోని వాక్యాలు చదువుతున్నారు వాళ్లు.

డాక్టరు నయన, సుందరిని పరీక్షించి పరీక్షలు సిఫార్సు చేసింది "మీకు ఎవరు కావాలి, అబ్బాయా, అమ్మాయా?" అంటూ నవ్వింది.

ఇదివరకటి డాక్టరు రిపోర్టులు చూపించింది సుందరి.

"ఇప్పుడు ఈ పరీక్షలు చేయించండి" అంటూ నవ్వేసింది డాక్టరు.

వారిలో కంగారు. కలవరం.

పరీక్షలకు ఏడువేలు అయ్యాయి.

సుందరికి అత్తగారి మాటలు గుర్తుకొచ్చాయి-'ఏమైనా కొడుకునే కనాలి. కూతురిని కంటే నీకే నష్టం' అని.

డాక్టర్ నయన సీతారామయ్య ప్రసక్తిని తరచూ తెస్తోంది. ఫలితంగా సుబ్బారావులో ఆరాటం, కంగారు.

సీతారామయ్య చెప్పిన ముహూర్తం నయనకు చూపించింది సుందరి. "మీరు కంగారు పడద్దు. ఇదే ముహూర్తానికి నాకు అయిదు ఆపరేషన్లున్నాయి. అయినా పరవాలేదు. ఆపరేషను జరిగి తీరుతుంది" అని అభయం ఇచ్చింది డాక్టరు.

అత్తగారి మాటలు డాక్టరుకి చెప్పింది సుందరి.

"రోజుకి అయిదారు సిజేరియన్లు చేసి నలభైవేలు సంపాదించటంతోపాటు పేషంటు, బిడ్డల ఆరోగ్యం కూడా నాకు చాలా ముఖ్యం" నిశ్చయంగా చెప్పింది నయన.

"మరో నాలుగైదు వేలు అదనంగా ఇస్తాను" అంది సుందరి నోరుజారుతూ.

నయన మాట్లాడలేదు. 'డాక్టర్లకు ఆశ మాత్రమే. పేషంట్లకు దురాశతో పాటు స్వార్థం కూడా..' అనుకుంది ఆమె.

డాక్టర్ నయన నర్సింగ్‌హోమ్‌లో చేరింది సుందరి డెలివరీ కోసం. సీతారామయ్య కూడా అక్కడే నాలుగైదుసార్లు కనిపించాడు హడావిడిగా కంగారు పడుతూ.

"అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. ఈ ముహూర్తంలో ఆడపిల్ల పుట్టడం చాలా మంచిది. శుభసూచకం, ఆనందదాయకం." అన్నాడు సీతారామయ్య ఏదో గుర్తు తెచ్చుకున్నట్టుగా.

"ఎందుకు?", అడిగాడు సుబ్బారావు.

"తండ్రీకొడుకులు బద్ధశత్రువులవుతారు!"

అంతలో ఆపరేషను థియేటరు నుంచి ఆయమ్మ బయటికొచ్చి సుబ్బారావుకి చెప్పింది "కంగ్రాట్స్.. ఆడపిల్ల...మహాలక్ష్మి" అంటూ.

షాక్ తిన్నాడు సుబ్బారావు.

డాక్టర్ నయన పదిహేను నిముషాలకు బయట్టికొచ్చింది.

"డాక్టర్ ఏమిటిది, స్కానింగులో అబ్బాయి అని చెప్పారుగా" అడిగాడతను.

"యంత్రాలు మనిషి చేసినవి. వాటిని నడిపేదీ మనిషే. ఒక్కొక్క సారి అంచనాలు తారుమారవుతుంటాయి. ఎనీ వే ఆడపిల్ల అదృష్టవంతురాలు. పైగా ఇప్పట్నుంచీ మీ అమ్మాయి మీకు ఖర్చు తగ్గిస్తోంది" అంటూ నవ్వేసింది డాక్టరు.

అంతలో సీతారామయ్య అక్కడి కొచ్చాడు. "రేపో ఎల్లుండో రండి.. పాప జాతకచక్రం వేసిస్తాను" అన్నాడు.

ఇక్కడ మరో విషయం కూడా లేకపోలేదు. నిజానికి సుందరికి కొడుకే పుట్టాడు. అదే సమయంలో సీతారామయ్య కూతురికి మూడో కాన్పులో ఆడపిల్ల పుట్టింది. ఉభయతారకంగా ఇద్దరికీ న్యాయం చేకూర్చేందుకు, సంసారపక్షంగా ఉండేందుకు సీతారామయ్య తెలివితేటలు పదివేల రూపాయలుగా మారిపోయి డాక్టరు నయన పర్సులో దాక్కున్నాయి.

అయితే రెండోసారి మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సుబ్బారావు అనుకుంటుంటే సుందరి మాత్రం మరోసారి భర్తకు గుర్తు చేసింది "మనమీద మనకు నమ్మకం లేకపోతే జాతకాన్ని పట్టుకొని వేలాడవలసివస్తుంది" అంటూ .

■



## మొల్ల

(క్రీ.శ. 16వ శతాబ్ది)

తెలుగు కవితా ప్రపంచంలో మొట్టమొదటి కవయిత్రి మొల్ల. కాలం విషయంలో కాదు, కావ్యనిర్వహణ పటిమలో కూడా ఆమెదే ప్రథమస్థానం. గోపవరపు శ్రీకంఠమల్లేశ్వర ప్రసాదలబ్ధమైన కవితా సంపదతో ఆమె రామాయణాన్ని రచించింది. శ్రీకృష్ణదేవరాయలకు సమకాలికురాలు.

ఆమె రచన మొల్ల రామాయణము. పదిహేనో శతాబ్దిలోని, శ్రీనాథుని మాత్రమే ఆమె తన కావ్యములో పేర్కొన్నది. పోతన శైలి ఆమెకు ఒరవడి. ఆమె ధారాశుద్ధి పాండిత్యోద్ధతి ప్రశంసనీయాలు. విరోధాభాస-శ్లేషాద్యలంకారాలను కూడా వసుచరిత్రకారుడు భట్టుమూర్తి కన్నా ముందే ఆమె చక్కగా నిర్వహించింది. స్వభావోక్తులకు, రమణీయమైన ఘట్టాలకు, పద్యాలకు ఆమె కావ్యం కాణాచి.

ఆమె తన కావ్యనిర్మాణంపో పాత్రలచేత సమయస్ఫూర్తితోడి చతురసంభాషణలను జరిపించింది.

మొల్ల రచించిన రామాయణం 'తెనుగునకున్ పొందై రుచియై వీనులవిందై విబుధుల మదికిన్' కానుపించునట్లు కందువ మాటల సామెతలందముగా కూర్చి తెనుగు నుడికారం శోభిల్లే కవితతో, హృదయరంజకమై తెలుగువారికి గర్వకారణమైంది.